ముందస్తు పరీక్ష.. జీవితానికి రక్ష

- క్యాన్సర్ నియంత్రణకు స్క్రీనింగ్ పరీక్షలు
- 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ..
- ఇంటింటికి వెళ్లి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది
- నియోజకవర్గంలో సుమారు 2.25 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు


భానుముక్కల గ్రామంలో ఇంటి వద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె రూరల్: క్యాన్సర్ మనుషుల ప్రాణాలను హరించివేస్తోంది. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలిసేలోగా మృత్యుఒడిలోకి చేరుతున్నారు. ముందస్తుగా ఎలాంటి లక్షణాలు లేకుండా శరీరాన్ని నాశనం చేసే ఈ మహమ్మారి ఉన్నట్లుండి మనిషి ప్రాణాన్ని తీసేస్తుంది. ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధిని ముందుగా గుర్తించేందుకు వైద్య సిబ్బంది ద్వారా నవంబర్ 14వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేపట్టి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తోంది. వైద్య సిబ్బంది ఈ సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ముందస్తుగా గుర్తిస్తే ఎంతో మేలు

క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక మందు అందుబాటులో ఉందని, ఈ వ్యాధిని ముందే గుర్తించడం ద్వారా మరణాల సంఖ్య తగ్గించడంతో పాటు పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. జాతీయ కుటుంబ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను చాలా ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోంది. క్యాన్సర్ వ్యాధిని ఎదుర్కోవాలంటే ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. మొదటి దశలోనే క్యాన్సర్ కణాలను గుర్తించడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు.

పరీక్షలు ఇలా..

వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్ల నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ఈ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేస్తారు. విద్యార్థులకు పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్‌ను ఇలా అనుమానించాలి

మానకుండా ఉండే పుండు, శరీరంలో ఏ భాగంలోనైనా ఎదుగుతున్న కణితులు, అసహజమైన రక్త స్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగడం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా అజీర్ణ వ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. 40 ఏళ్ల దాటిన మహిళలు ఛాతిలో చిన్న గడ్డ కనిపించినా వెంటనే రొమ్ము పరీక్ష (మామోగ్రామ్) చేయించుకోవాలి. బాలింతలు తప్పనిసరిగా ఏడాదిన్నర వరకు బిడ్డకు చనుబాలు ఇవ్వాలి. లేకపోతే రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది. 9 నెలలు నిండాక బిడ్డను జన్మనివ్వకపోయినా, 25 ఏళ్లలోపు ఒక్కసారైనా గర్భం దాల్చకపోయినా, త్వరగా రజస్వల అయ్యేవారిలో, మెనోపాజ్ 55 ఏళ్లు దాటినా కాకపోతే, మెనోపాజ్ తర్వాత హార్మోన్ మందులు వాడేవారిలో, అధిక బరువు ఉండేవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ.

క్యాన్సర్‌కు కారణాలు

క్యాన్సర్ వ్యాధి రావడానికి పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఇందులో 4 శాతం జన్యుపరంగా, 6 శాతం తీసుకునే నీరు, ఆహారం, 15 శాతం స్థూలకాయం (రొమ్ము, గర్భాశయం, పేగు, మూత్రపిండాల క్యాన్సర్లు), 40 శాతం పొగాకు (నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు), 10 శాతం ఇన్‌ఫెక్షన్లు (హెచ్‌పీవీ, హెపటైటిస్ బి వల్ల వచ్చే కాలేయ క్యాన్సర్), 25 శాతం క్యాన్సర్లు (రక్తం, ఎముక, పాంక్రియాస్ క్యాన్సర్)లకు సరైన కారణాలు లేవని వైద్యులు చెబుతున్నారు. మగవారిలో ఎక్కువగా నోటి, జీర్ణాశయ, కాలేయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు వస్తున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లో 18 ఏళ్ల నిండిన వారు సుమారు 2.25 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ వైద్య సిబ్బంది క్యాన్సర్ స్కినింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక లక్షణాలు కనిపించిన వారిని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక క్యాన్సర్ శిబిరాలకు పంపి వైద్యం అందిస్తారు. 9 నెలల పాటు స్క్రీనింగ్ కార్యక్రమం కొనసాగుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

సర్వేకు సహకరించాలి



క్యాన్సర్ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మారిన జీవనశైలి, దూమ, మద్యపానాలు, పొగాకు సేవనం, వంశ పారంపర్యం వంటి కారణాల వల్ల కేసుల సంఖ్య ఎక్కువవుతోంది. ఈ వ్యాధిని ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి నయం చేసే అవకాశం ఉంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పరీక్షలపై ఎలాంటి అపోహలు అవసరం లేదు.

–డాక్టర్ శివశంకరుడు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, టంగుటూరు

క్లుప్తంగా

పైప్‌లైన్లకు మరమ్మతులు


వెల్డింగ్ చేస్తున్న సర్పంచ్ శివరాముడు

కొలిమిగుండ్ల: మంచినీటి సరఫరా చేసే పైప్ లైన్‌లు లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల సర్పంచ్ శివరాముడు తెలిపారు. ఆదివారం పలు వీధుల్లో పైప్‌లైన్లకు వాటర్ లీకేజీ అవుతుండడంతో సర్పంచ్ స్వయంగా వెల్డింగ్ పనులు చేశారు. అన్ని కాలనీలకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లీకేజీల వల్ల నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

లైటింగ్ టైమింగ్ మార్చండి


సాయంత్రం 6గంటలు దాటినా వెలగని సెంట్రల్ లైటింగ్

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ టైమింగ్స్ మార్చాలని స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశాలమైన రోడ్డు నిర్మించారు. రామ్‌కో సిమెంట్ సహకారంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. ఆటోమేటిక్ ఆన్ అయ్యేలా టైమర్ సెట్ చేశారు. ప్రతి రోజు ఆ సమయానికి ఆన్, ఆఫ్ అవుతుంటాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో సాయంత్రం 6గంటలకే చీకటి పడుతోంది. లైటింగ్ సాయంత్రం 6:24 గంటలకు ఆన్ అవుతున్నాయి. ఆలోగా చాలా చీకటి ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తెల్లవారుజామున 6 గంటలకు బంద్ అవుతున్నాయి. ఆ సమయంలో కూడా చీకటి నెలకొని ఉంటుంది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో టైమింగ్‌ను మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు



బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలో ఉన్న అభయాంజనేయస్వామికి మార్గశిర మాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు సత్యం, మమత ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూరార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహా మంగళహారతి సమర్పించారు.

దుస్తుల పంపిణీ


సీఎస్ఐ చర్చిలో నిరాశ్రయులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ రాజేంద్రబాబు, సామేల్ ల్యాంబట్ బాబు చేతుల మీదుగా నిరాశ్రయులైన మహిళలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ముందస్తు క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సుజాతమ్మ

డోన్ టౌన్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసుధ హైస్కూల్‌లో లగోరి అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లగోరి పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామానికి చెందిన చాకలి ఎల్లప్ప కుమారుడు చాకలి మధు(29) ఈనెల ఒకటో తేదీ సుంకులమ్మ ఆలయం వరకు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి చాకలి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నూతనంగా ఎన్నికైన ఏఐటీయూసీ కమిటీ

కోవెలకుంట్ల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలో కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుక పాలసీ మారుస్తామని, అందరికీ ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని, సంక్షేమ బోర్డును పున:ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా భవన కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చినా ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా శివబాలకృష్ణ, గౌరవ సలహాదారుడిగా రమేష్, అధ్యక్ష, కార్యదర్శులుగా దస్తగిరిబాషా, రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా మహమ్మద్‌రఫీ, రామచంద్రుడు, పక్రుద్దీన్, సహాయ కార్యదర్శులుగా ఉసేన్‌వలి, సుబ్రమణ్యచారి, ప్రసాద్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రమణ, వర్కింగ్ ప్రసిడెంట్‌గా చంద్రమౌళీశ్వరచారి, కోశాధికారిగా మహమ్మద్‌ఉసేన్‌లను ఎన్నుకున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

- డోన్ ఆర్డీఓ నరసింహులు


హెచ్‌కొట్టాల రైతులతో మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ

బేతంచెర్ల: రైల్వే డబుల్‌లైన్ పనుల కారణంగా భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని డోన్ ఆర్డీఓ నరసింహులు అన్నారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన నిర్మించే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వల్ల 2.85 ఎకరాల భూమిని కోల్పోతున్న 21 మంది రైతులతో ఆదివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంకా నష్టపరిహారం పెంచాలనే రైతుల అభిప్రాయాన్ని కలెక్టర్, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే సిమెంట్ నగర్ గ్రామ సమీపాన నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి నష్ట పరిహారంపై పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఆర్డీఓ చర్చించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఆర్ఐ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు విజయలక్ష్మి, రమేష్ చౌదరి ఉన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సత్కారం


75 ఏళ్లు నిండిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సత్కరిస్తున్న పెన్షనర్లు

డోన్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రజా సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో 75 వసంతాలు పూర్తి చేసుకున్న రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు దాసప్ప, సుబ్బరాయుడులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు హనీఫ్, కార్యదర్శి గాలయ్య, రామక్రిష్టారెడ్డి, మౌలాలి, హుసేన్‌సాహెబ్, గోపాల్, ఆంజనేయులు, రాందాస్‌రెడ్డి, మహానంది, జయరాముడు పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు తగదు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత శివబాలకృష్ణ

బనగానపల్లెరూరల్: ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పలుకూరు పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఇందులో శివబాలకృష్ణ మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు, రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకురాలు జ్యోతి, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. మండలంలోని గుళ్లదూర్తికి చెందిన చాకలి సుబ్బరాయుడు సొంత పని నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన మనోహర్ రెడ్డి, స్వర్ణలత బైక్‌పై కోవెలకుంట్లకు వస్తుండగా పట్టణ శివారులోని మిర్చియార్డు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

మృతదేహానికి అంత్యక్రియలు


యూసఫ్‌బాషాకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లోఒంటరిగా జీవనం సాగిస్తున్న ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు యూసఫ్ బాషా (62) అనారోగ్యంతో మృతిచెందాడు. సిమెంట్‌నగర్ సర్పంచ్ ఏస్తేరమ్మ ఆ నలుగురు సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు తెలియజేసి మృతదేహాన్ని స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బేతంచెర్లకు తరలించి ఇస్లాం మత ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. గతంలో అనాథ శవాల అంత్యక్రియల్లో యూసఫ్ బాషా అందించిన సేవలను కొనియాడారు. సంస్థ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, రాఘవేంద్ర, అక్బర్, వెంకటేశ్వర్లు, వన్నూర్ బాషా, మహేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

గంగ పుత్రుల నూతన కమిటీ

డోన్ టౌన్: డోన్ తాలూక గంగపుత్రుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక కోట్లవారిపల్లె సమీపంలోని గంగమ్మగుడి వద్ద సంఘీయులు హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా మల్లికార్జున, అధ్యక్షుడిగా కొచ్చెర్వు గోవిందు, ఉపాధ్యక్షుడిగా చీనికాయల వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శిగా నేరేడుచెర్ల సాంబశివుడు, సహాయ కార్యదర్శిగా గోసానిపల్లె మాధవస్వామి, కోశాధికారిగా ఎస్.శివుడు, న్యాయ సలహాదారునిగా చంద్రుడుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సంఘం నాయకులు సతీష్, మల్లికార్జున, మాజీ సర్పంచ్ శ్రీరాములు, శ్రీరాములు, మల్కాపురం శివయ్య, రవికుమార్, సోమయ్య, ఓబులేసు, శ్రీనివాసులు, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు హాజరయ్యారు.

ఆలయాల పరిశుభ్రతకు తోడ్పాటు


కంచిలోని కోనేరును శుభ్రం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆధ్యాత్మిక నిలయాలుగా విలసిల్లే పూరాతన ఆలయాల పరిశుభ్రతకు తోడ్పాటు అందిస్తున్నట్లు బేతంచెర్ల మన ఊరు–మన గుడి ప్రతినిధులు నాగేశ్వరరావు, అజయ్, శ్రీనువాసులు, మధు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని 18 శక్తి పీఠాల్లో ఒక్కటైన కంచి కామాక్షి ఆలయ ప్రతినిధుల ఆహ్వానం మేరకు పరిసరాలను పరిశుభ్రం చేయడానికి అక్కడికి వెళ్లారు. ఆదివారం ఆలయ పరిసరాలతో పాటు పూరాతన కోనేరు శుభ్రపరిచే పనిలో పాల్గొన్నారు. ఆదిశంకరాచార్యుల మఠాన్ని కూడా శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆలయాల పరిశుభ్రతకు కృషి చేయడంతోనే కంచి కమాక్షి ఆలయంలో అవకాశం కల్పించారన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం


మాట్లాడుతున్న బీజేపీ డోన్ కన్వీనర్ రమణ

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సంధు రమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శివ రామిరెడ్డి, నాయకులు నాగ మోహన్, రవి శంకర్, హరికృష్ణ, మోహనయ్య, మద్దిలేటి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

డోన్ రూరల్: గ్రామంలో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఇంతియాజ్‌బాషా హెచ్చరించారు. మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. గ్రామంలో గొడవల జోలికి వెళ్లకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అనవసర విషయాల్లో తలదూర్చి సమస్యలు కొనితెచ్చుకోవద్దని హితవుపలికారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకోవాలన్నారు. సీఐ రాకేష్, ఎస్ఐ మమత, సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న సీఐ

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

డోన్: నంద్యాల పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి సతీష్‌గౌడ్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి చనిపోవడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నరసింహులు ఆదివారం అతని కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహులు, తహసీల్దార్ నాగమణి, ఆర్ఐ మస్తాన్ పాల్గొన్నారు. మృతుని స్వస్థలం డోన్ మండలం సోంపురం గ్రామమని అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1998–99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. దాదాపు వంద మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట సమావేశం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు గతాన్ని నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. పరస్పరం అడ్డపేర్లతో పిలుచుకుంటూ ఆటపట్టించుకున్నారు. తరగతి గదుల్లో కలియతిరుగుతూ గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధులే తమకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించాయని పలువురు విద్యార్థులు తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సామ్రాజ్యలక్ష్మి, కళావతి, రమేష్, కృష్ణవేణి, విశాలాక్షి, మహమ్మద్ సాహెబ్ తదితరులను సన్మానించారు.

ప్రమాదకరంగా కల్వర్టులు


ఇందిరానగర్ దస్తగిరిస్వామి దర్గా వద్ద ధ్వంసమైన కల్వర్టు


పాతబస్టాండ్ జాతిపిత విగ్రహం వద్ద ధ్వంసమైన కల్వర్టు

డోన్: మున్సిపాలిటీ పరిధిలో పలు రహదారులపై నిర్మించిన కల్వర్టులు ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని రామాలయానికి వెళ్లే రహదారిలో కర్నూలు గేటు, పాతబస్టాండ్‌లో జాతిపిత విగ్రహం, ఇందిరానగర్ దస్తగిరి స్వామి దర్గా వద్ద కాల్వలపై కల్వర్టులు ధ్వంసం కావడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంబాలపాడు రహదారి, తారకరామనగర్ చర్చి వద్ద కల్వర్టు పూర్తిగా కుంగిపోవడంతో పలువురు వాహనదారులు ద్విచక్ర వాహనాల నుంచి కిందపడి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణాలు కోల్పోక ముందే కల్వర్టులను పునర్నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.